
- కథ -

# అమ్మా.... అమ్మా....

- కొట్ర జగన్నాథ శాస్త్రి




అమ్మ కళ్ళంట నీళ్లు కారుతున్నాయి...
అమ్మ చీరకు అన్నీ మాచికలే ఉన్నాయి..
అమ్మ బంగారం రంగు శరీరం నిండా
ఎండకు కమిలిన మచ్చలున్నాయ్
అమ్మ గాది దగ్గర మట్టి వరండాపై
రాలిన ధాన్యం గింజలు
జాగ్రత్తగా తుడిచింది... రోట్లో
పోసి దంచింది... చేటలో
పోసి చెరిగింది.

రెండు దోసెళ్లు బియ్యం
వచ్చాయి.

చిరిగిన నిక్కరు... కొయ్యగూళ్లు
కనిపిస్తూ పెద్దాడు జగ్గు, బూరిబుగ్గలు....
ముక్కు కారుతూ గుండ్రని కళ్లతో చిన్నాడు సూరి
పెచ్చులూడిన గచ్చు చపటా మీద కూర్చుని
ఆడుకుంటున్నారు.

ఆటల్లో ఆకలి మరిచిపో యారు....

అయినా మధ్యలో ఆకలి గుర్తొచ్చి. ప్రేవులు "గుర్" మంటుంటే సూరి...

'అమ్మా... ఆతలే.." అంటూనే ఉన్నాడు..

అమ్మ కళ్లంట నీళ్లు కారుతూనే ఉన్నాయి.

అదే అమ్మంటే మరి... ఎలాగైనా తన ప్రేగు తెంచుకొచ్చిన బిడ్డలకు ఆకలి తీర్చాలి... శరీరాకృతి పెరిగేలా చూడాలి... ప్రకృతి అనుమతిస్తే... వీధి దీపాలక్రిందైనా చదివించి కలెక్టర్‌ని చేసెయ్యాలి. అదీ అమ్మంటే... అమ్మంటే ఒక స్త్రీ కాదు.. ఆదిపరా శక్తి.

అంతటి ఆదిపరాశక్తి అమ్మ... ఏడుస్తూనే ఉంది..

ఎసరు మరిగాక బియ్యంపోసింది.... మట్టి మూకుడు మూతపెట్టింది

ఆర్ధ్రతో పిల్లలిద్దర్నీ చూసింది.. బొటాబొటా కన్నీళ్లు కార్చింది.

అమ్మ హృదయంలానే ఎసరు మరుగుతోంది... మూకుడ్ని ఎత్తి కుదేస్తోంది... కాలం ఎలాంటి జీవితాన్నైనా క్షణంలో మార్చెయ్య గలదని సింబా లిక్‌గా చెప్పేస్తోంది.

అమ్మ కన్నీళ్లు కారుతూనే ఉన్నాయి.

'అమ్మా సుబలచ్చింగారూ.. అమ్మాయి ఉతకా లాడిందండి'

'అహ ఎప్పుడే బూసమ్మా..' ఉండు వస్తున్నా.. అంటూ పాతచీరలు... పాతబియ్యం.. పాత నారింజ ఊరగాయి ఇచ్చిందామెకు సుబ్బలక్ష్మి...

"అమ్మోయ్ సుబలచ్చింగారూ... అమ్మాయికి పెతానం సేసేదండి"

"అహా అలాటే పైడమ్మా... నాకు పాలు లేకపోతే మా పెద్దాడు జగన్నాథం చచ్చుండేవాడు.. నువ్వు నీ కొడుకుతోపాటు నాకొడుక్కీ చన్ను కుడిపి బతికించావ్..." అంటూ ఇదిగో ఇది నీ కోడలికి అంటూ ఒక బంగారు గొలుసు ఇచ్చింది సుబ్బలక్ష్మి.

"తల్లి తల్లా.... బగమంతుడు సల్లగ సూడాలి.." అంటూ బయలుదేరింది జాలారి పైడమ్మ..

సుబ్బలక్ష్మి నడుస్తుంటే పొట్టి లక్ష్మీదేవి నడిచి వస్తున్నట్లుంది. వడ్డాణం.... జిగినీ గొలుసు... దండ వంకీలు.. నాగరం.. చంద్రహారం.. వందతులాల బంగారం ఆమె శరీరం మీద జిగేలుమంటోంది.

- - -

అమ్మ కన్నీళ్లు కారుతున్నాయి.

"నా యిన్లారా... తాగండి... అంటూనే వెండి కంచంలో జగన్నాథానికి, పింగాణి ప్లేటులో సూరి బాబుకి అన్నం గంజి కలిపిన పదార్థాన్ని పోసింది... పొగలు, ఆవిర్లు. భలే హాయిగా ఉంది.

'అమ్మా...' తమ్ముడు సూరిబాబు చెయ్యి పెట్టేశాడు గంజిలో

'నాయిన్నాయిన' తమ్ముడు చెయ్యి వేళ్లు నోట్లో పెట్టుకుంది అమ్మ.

'అమ్మా నంచు...'

"ఏం లేదుబాబూ.. చల్లారేక ఉప్పు, ఉల్లిపాయి నంచుకో అమ్మా"

అమ్మ కన్నీళ్లు.... కడవలకొద్దీ కన్నీళ్లు..

అవును.. మహాకవిగా... జ్యోతిష్కునిగా.. వాగు మార్తాండునిగా సన్మానం..." సభా సదులారా... ఈ సన్మానానికి ముందు నేను ఇద్దరు స్త్రీ మూర్తులను గౌరవించాలి... అరుగో వారు. అమ్మా.. స్టేజి మీదకు రా అమ్మా... రెండవ వారు.. జాలారి పైడమ్మ... నాలో ప్రవహిస్తున్నది ఆమెరక్తం... నాకు బ్రతుకు నిచ్చింది అమ్మ.... బ్రతకనిచ్చింది పైడమ్మ... అంటూ ఇద్దరికీ పట్టుచీరలు ఇచ్చి పాదాభివందనం చేశాడు జగన్నాథం.

అమ్మ కళ్లనీళ్లు కారుతూనే ఉన్నాయి.

ఇప్పుడవి ఆనందభాష్పాలు.... ❖

# 2003 ఎక్స్‌రే కవితా అవార్డుల వేడుక

**"జీవనోత్సవం" కవితను 'ఎక్స్‌రే' సంస్థ ఉత్తమ కవితగా ఎంపికచేసి కవి భగవంతం ను సత్కరించి, ఎక్స్‌రే పురస్కారాన్ని అందించింది.**

## 10 ఉత్తమ కవితా పురస్కార గ్రహీతలు :

**కె. రవికుమార్** (దాచేపల్లి) 'నీళ్ళెలా... బ్రతికుంటాయి?!"

**జాన్‌హైడ్ కనుమూరి** (హైదరాబాద్) "పుబికే బిందువుల్లో ఓ నది"

**లకుమ** (నాగార్జున సాగర్) "ఒక నాగేటి చాలూ! అనేక శవపేటికలూ!!"

**తుమ్మల దేవరావు** (నిర్మల్) "ఏకముఖ యుద్ధమనంతర విరామం"

**సుజాతారావు** (నిర్మల్) "విరిగిన నాగళ్ళు"

**పెరుగు రామకృష్ణ** (నెల్లూరు) "పాదరక్షకుడు"

**వై.హెచ్.కె. మోహనరావు** (పిడుగురాళ్ళ) "అసువులు రాలేకాలం"

**శైలజామిత్ర** (హైదరాబాద్) "ధవళపుష్పగుచ్ఛం"

**డా॥ కలవకుంట రామకృష్ణ** (మెట్‌పల్లి) "అ" మంగళుడు

**కె.కె. జ్యోతి** (విజయనగరం) "ఎరుపేందే?"

"24 గంటల కవి సమ్మేళనం"తో విజయవాడకి సాహితీ ప్రపంచంలో ఒక ఉన్నతమైన ఖ్యాతిని తెచ్చిన ఎక్స్‌రే సంస్థ రూపశిల్పి కొల్లూరి ఏప్రిల్ 24, ఆదివారం సాయంత్రం విజయవాడ హోటల్ శ్రీపాద కాన్ఫెరెన్స్ హాల్‌లో చాలా ఆత్మీయంగా జరిపిన ఈ అవార్డుల ఉత్సవం అందరి మన్ననలు అందుకుంది. ప్రధాన వక్తగా విచ్చేసిన ప్రముఖ కవి **శివారెడ్డి** ఈ కవితలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. అంతకన్నా ముఖ్యంగా ఈ సభలో శివారెడ్డి ప్రసంగం ఆద్యంతం ఆసక్తికరంగా సాగి సభికులను రంజింపజేసింది. – చినుకు